
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





## - 187 -
## అమెరికా'కాకిగోల' కథ

**ఎందుకో తెలియదు కానీ** నాకు నేర్పడం కంటే, నేర్చుకోవడం అంటే ఎక్కువ ఇష్టం.  అందుకేనేమో, నేను అపుడెప్పుడో బొంబాయి ఐఐటిలోనూ, అమెరికాలో మూడు కళాశాలలలోనూ ఉపాధ్యాయుడిగా పని చేసినప్పుడు ఇంజనీరింగ్ పాఠాలు నేర్పినప్పుడు ఎంతో ఆనందపడినా, ఈ మధ్య మళ్ళీ  తెలుగు నేర్చుకోడానికి విద్యార్థిగా నమోదు చేసుకున్నాను. ఆ మాటకొస్తే నేను నిత్య విద్యార్థిని. రోజూ ఏదో ఒకటి నేర్చుకోవడం అంటే భలే ఇష్టం. ఇంతకీ ఈ విద్యార్థి ఎలా ఉండాలో శాస్త్రం ఏమి చెప్పిందీ అంటే...విద్యార్థి అనే వాడు 'కాక చేష్టలు" చెయ్యాలిట. కాక చేష్టలు అంటే బక ధ్యానం, శ్వాస నిద్ర, అల్పాహారం, గృహత్యాగం... ఇవన్నీ ఒక విద్యార్థి పాటించవలసిన నియమాలు..ట. మొదటి అసలైన కాక చేష్ట ఏమిటంటే తెల్లవారు జామునే లేచి చలాకీ గా ఉండాలి..ట. అంటే విదార్థి అనే వాడి దిన చర్య పొద్దున్నే లేచి, చలాకీగా ఉండడానికి వ్యాయామం చేసి, వెంటనే కొంగ లాగా ఏకాగ్రతతో నిమగ్నం అయిపోయి చదువు జపం చెయ్యాలి. ఎక్కువ సేపు నిద్ర పోకూడదు. తక్కువగా తినాలి. పైగా ఇంటిపట్టునే ఉండకుండా  జ్ఞానార్జన కోసం దేశాటన చెయ్యాలి. అంటే సంసారం చెయ్యకూడదుట..ఇదంతా " వేదాలలోనే ఉంది ష".

ఇక అసలు ఈ కాకి అనే పక్షి గురించి పూర్తిగా తెలియాలి అంటే మొన్నీ మధ్య వచ్చిన 'బలగం' సినిమా చూడాల్సిందే!. అందులో హీరో సదరు కాకి గారే! మన పవిత్ర భారత దేశం లో కాకుల కున్న నిబద్ధత, వాటి జీవన శైలై వలన మనం ఇచ్చే  ప్రాధాన్యత ఈ బలగం సినిమాలో బాగానే చూపించారు. మన ఋషులు కాకిని కాలజ్ఞాని అన్నారు. ఇదంతా ఎందుకంటే కాకి బ్రహ్మ ముహూర్తం లో నిద్ర లేచి, వెంటనే స్నానం  చేస్తుంది. 'కావు కావు' అని అరుస్తూ అందరినీ నిద్ర లేపుతుంది. అంటే 'ఈ సిరి సంపదలు ఏమీ నీవి కావు" అని కాకి మన తెలుగులో కావు కావు అని అరుస్తుంది అనమాట. మరి అరవ్వాళ్ల కాకులు "ఇళ్లై, ఇళ్లై," అనీ, హిందీ కాకులు "తుమారా నయ్, హమారా హయ్" అనీ అరుస్తాయేమో నాకు తెలీదు. నిజానికి అసలు ఆ కాకి అలా అరుస్తూ తన కుటుంబాన్ని, కులం వాళ్ళనీ లేపి

ఎక్కడయినా పకొడీలు, పరమాన్నం కనపడితే అందరితో కలిసి 'ఎంగిలాకుల భోజనాలు', చేసి తనూ. తద్దినం భోజనాలు ఆరగించి మన పితృదేవతలనీ సంతృప్తి పరుస్తుంది. పైగా మనం "ఏకాకి" అంటాం కానీ నిజానికి కాకి ఎప్పుడూ ఇతర కాకులతో కలిసే ఉంటుందిట. ఎప్పుడైనా ఏ గెద్ద, రాబందు లాంటి శత్రువునైనా దరిదాపులలో గుర్తిస్తే చాలు..వెంటనే సంఘంలో ఉన్న అన్ని కాకులకీ సందేశం పంపి కలిసి పోరాటం చేస్తుంది. అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఎప్పుడూ పరుల కంట పడకుండా ఎంతో గోప్యంగా మాత్రమే ఆడ కాకి, మగ కాకి శృంగారం లో కలుస్తాయిట. ఇక ఒక కాకి మరణిస్తే మొత్తం అక్కడి కాకులు అన్నీ గుమిగూడి, సామూహికంగా రోదిస్తూ, కలిసి స్నానం చేసి అప్పుడు గూటికి చేరతాయి. అన్నట్టు, రోజంతా ఎక్కడ తిరిగినా, సూర్యాస్తమం సమయానికి కాకులు పాటించే జీవన నియమం. అలా ఇంటికి చేరాక కాకి ఆహారం ముట్టదు.

భారత దేశంలో కాకులు అలా ఉంటే ఇక అమెరికాకుల సంగతి చూద్దాం...

అమెరికా పల్లెటూళ్ళ లో సంగతి నాకు తెలీదు కానీ గత ఏభై ఏళ్ళ లోనూ నేను ఉండే పెద్ద పట్టణాళ్ళ ఎప్పుడైనా కాకి కనపడితే, గిన పడితే అది 'ఏకాకి' గానే!. కాకుల మంద ...కనీసం ఐదారు కాకులని ఒకే చోట ఎప్పుడూ చూడ లేదు. ఇక నాకు కలిగిన అసలైన 'నిరాశ" ఏమిటంటే ఆ కనపడిన కాకి నా సిరి సంపదలు శాశ్వతం కావు అని కావు కావు మని చెప్పకుండా, తన మానాన తను గడ్డిలో పురుగులు ఏరుకుంటూ గెంతులేసుకుంటూ పోవడమే...అనగా..ఇప్పటి దాకా అమెరికాలో నన్ను ఏకాకీ 'కావు కావు' అంటూ నిద్ర లేప లేదు. నేను అమెరికా లో ఇప్పటి దాకా కాకి అరుపు వినినే లేదు. కానీ "కా" అనే కాకి అరుపు వార్నింగ్, కోపం, సరదా, సూచన, ప్రేమ ఇలా ఒక్కొక్క సారి ఒక్కొక్క అర్ధం వస్తుంది అనీ, వినే అన్ని జాతులకీ వారి వారి అర్ధాలు స్ఫురిస్తాయి అనీ నేను ఎక్కడో శాస్త్రీయ పరమైన వ్యాసం లో చదివాను. ఆ లెక్కన అమెరికాకులు అస్సలు నోరు విప్పవు కాబట్టి అమెరికా వాళ్ళని 'ఎల్లప్పుడూ నోరు మూసుకోండి, వెధవల్లారా" అని సందేశం ఇచ్చినట్టే కదా!. అలాగే అప్పుడప్పుడు ఉడతలు మా ఇంటి ముందు చెట్ల మీదకి పాకుతూ, ఒక సారి తల పంకించి 'హలో' చెప్పి పోతాయి కానీ వాటి నుదిటి మీద 'రాముడి నామాలు" ఎప్పుడూ కనపడ లేదు. బహుశా రాముడు అమెరికాలో పుట్ట లేదు కాబట్టి అవి ఉడతా భక్తిగా ఏమీ చెయ్య లేదు కాబట్టి వీటికి అలా నుదిటి మీద నామాలు పెట్టించుకునే అవకాశం రాలేదు అనే అనుకోవాలి.

అలాగే మరి ఈ నేల, ఈ గాలీ మహాత్మ్యమో ఏమిటో కానీ, ఇక్కడ మా తోటలో పూసే మల్లె పూవులు, గులాబీలు, ఆఖరికి నైట్ క్వీన్ కూడా చూచుటకు సుందరాంగులే కానీ సువాసనకి ఆమడ దూరం అని మా క్వీన్ విక్టోరియా ఎప్పుడూ "ఏ రాయి అయితేనేం?" అనేసుకుని తలలొ ప్లాస్టిక్ పువ్వులు పెట్టేసుకుంటుంది. కానీ నిన్న వరలక్ష్మీ వ్రతానికి కూడా ఈవిడ ఆ ప్లాస్టిక్ పువ్వులు వాడుతుందేమో అని నాకు డౌటనుమానం వచ్చేసింది. ఎంతయినా పూజ కదా...పైగా ఈ వరలక్ష్మీ వ్రతం తను ఎంతో కష్ట పడి భరిస్తున్న "ఏయ్ మొగుడూ" అయిన నా క్షేమం గురించేట కదా. ఒక వేళ ప్లాస్టిక్

పువ్వులతో కొలిస్తే ఈ దేవతలు, దేవుళ్ళ కోపం నా మీద చూపిస్తేనో...మనం డేంజరపాయం లో పడతామేమో...అని నేనే ఆవిడకి మా తోటలో పువ్వులు కోసి ఇచ్చాను. ఆవిడ 'నీకేం దుక్కలా ఉన్నావు. ఎందుకా ఓవరేక్షనూ... ఈ సారి రూటు మార్చానులే. పూజంతా మనవడూ, మనవరాళ్ళ గురించే" అని బుకాయించింది మా క్వీన్ విక్టోరియా.

అసలు అమెరికాకుల సంగతి అలా ఉంటే మళ్ళీ తెర మీదకి వస్తున్న మన తెలుగు అమెరికా'కులం కాకుల' సంగతి ఎలా ఉందో సరదాగా చూద్దాం. కాకుల లాగానే ఇక్కడ కూడా ఏ కులానికి చెందిన వారు ఆ కుల సంఘం పెట్టేసుకునో, ఉన్న సంఘాలని కుల సంఘాలుగా మార్చేసో హాయిగా సంఘటితంగా ఉంటారు. సంఘాల జోలికి వెళ్ళని వారు కాకుల మందలాగా స్నేహ బృందం ఏర్పాటు చేసుకుని వారాంతం లోనూ, పండుగలకీ, పబ్బాలకీ ఏక వర్గ సామూహిక విందు భోజనాలు చేసుకుంటారు. కానీ తద్దినాలకి మటుకు అన్ని వర్గాల వారినీ పిలిచి సంతర్పణ చేస్తారు. దీనికి కారణం అమెరికాలో కాకులు లేవు కాబట్టి తద్దినం భోజనం తిని పితృదేవతలని తృప్తి పరచడానికి  అర్హమైన వాళ్ళని పిలవాలి కదా! మా ఊళ్లో గుళ్ళు కొన్నింటికి కూడా వర్గం  అనేది అనధికారిక ప్రాతిప్రదిక. అంతా గుడి గుడి గుంచాల ఆటే!. పైకి భాగవతం, లోపల కుల భాగోతం. ఇదంతా కొత్త విషయం "కాక" పోయినా. కుల తత్వాన్ని ఎప్పటికైనా 'కాకి ఎత్తుకు పోతుందిలే" అనుకున్నాను కానీ... ఎక్కడి గొంగళీ అక్కడే....

ఎందుకంటే.."సారూ, మొన్ననే "డాలస్ నుంచి కొంత మంది ఫ్రెండ్స్ వచ్చారు. మిమ్మల్ని కలవాలి అనుకుంటున్నారు. ఫలానా సాయంత్రం సరదాగా మా ఇంటికి రండి" అని ఒకాయన పిలవగానే సరదాగానే కదా అని నేనూ అలాగే సెంటు కొట్టుకుని వెళ్ళాను. యధా ప్రకారం మధు పానీయాలూ వగైరా సరదాలు అయ్యాక హడావుడిగా అన్నీ కుర్చీలూ ఏదో సాహిత్య సమావేశంలాగా వరసగా అమిర్చేసి, ముందు మైకు ఏర్పాటు కూడా చేశేశారు. అప్పటికీ నా మట్టి బుర్రకి ఇంకా వెలగ లేదు....అంచేత ఈ సారి 'తల  స్విచ్' వేసి చుట్టూ చూస్తే అక్కడ అందరూ ఒకే జాతి హంసలే. నేను ఒక్కడినే హంసల్లో కాకి ని..ఏకాకిని...అనగా...ఆ ఇంటి యజమాని తో సహా, ఆ డాలస్ పెద్ద మనిషితో సహా అందరూ ఒకే కండువా వారు. ఇక డాలస్ ఆయన, బహుశా ఆ కండువా నాయకుడు అనుకుంటాను...ఆయ్న లేచి ఈ సారి అక్కడ జరగబోయే ఎన్నికలలో చావా, రేవా తేల్చుకోవాలి అని గంభీరమైన ఇచ్చిన ఉపన్యాసంతో అసలు తతంగం మొదలయింది. అనగా...ఇక్కడ అమెరికాలో ట్రంప్ –బైడెన్ యుద్ధం మొదలై, మెల్ల మెల్లగా కాకి గోల గా మారుతోందో అక్కడ ఆంధ్ర ప్రదేశ్ లో కూడా ఎన్నికల సంగ్రామం మొదలయింది అన మాట. దానికి  దన్నుగా ఇక్కడ కూడా అక్కడి జెండాలు ఇక్కడ కూడా రెప రెప లాడడం మొదలు పెట్టాయి. ఏ ఎజెండా లేకుండా, తెల్ల కండువా ఊపేసి ఓటమిని అంగీకరించి రెండు కండువాలకి మధ్య ఊగిసలాడుతున్న నా బోటి నిత్య విద్యార్థి ఇద్దరికీ ఆటలో అరటి పండు  మరియు రెండింటికీ చెడ్డ రేవడు. ఆ రోజు మీటింగ్ లో తెలుగు భాష, సాహిత్య సంస్కృతుల మీద నా చేత మాట్లాడించి నన్ను కూడా హంసల్లో కలుపుకోడానికి ఆ రోజు కండువా ప్రయత్నం అన మాట. కాకి లాగా కాల జ్ఞానిని కాక పోయినా...నాకు

కండువాల పరిజ్ఞానం మాత్రం ఉంది....అనగా. ఆ రెండు కండువాలూ కలిసి తెలుగు భాష, సాహిత్యం సంస్కృతులని అటక ఎక్కించేశాక ఎవరైతే మనకేం? దొందూ దొందే!. ఇంకో వారం, పది రోజుల్లో ఆ రెండో కండువా వారు కూడా ఎలాగా నన్ను పిలిచి మాట్లాడమంటారు. మనది అదే స్పీచ్...ఏమీ మార్చక్కర లేదు...నా అప్రస్తుత ప్రసంగ సారాంశం ఒకటే....." ఏ రాయి అయితేనేం?

**COMMENTS**